క్లుప్తంగా

అధ్వానంగా కాలనీ రహదారులు



మెట్టకాలనీలో రోడ్డు దుస్థితి

చీపురుపల్లి: ప్రధాన రహదారులు మాత్రమే కాదు కాలనీల్లో సైతం రహదారులు అధ్వానంగా ఉన్నాయని చెప్పడానికి చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని మెట్ట కాలనీలో కనిపించే రోడ్డు చక్కని ఉదాహరణగా నిలుస్తోంది. దాదాపు 500కు పైగా నివాసాలు ఉన్న మెట్టకాలనీలోని పలు వీధుల్లో కనీసం సిమెంట్ రోడ్లు కూడా లేకపోవడంతో కాలనీ వాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కాలనీలో ఉన్న రహదారులు గోతులతో నిండిపోయి రాకపోకలకు వీల్లేకుండా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా రహదారులపై దృష్టి సారించకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న పాట్నూరు సన్యాసినాయుడు , సర్పంచ్ రాము

గుర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పాలవలస గెడ్డబడి వీధిలో రూ. 2 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలవలసలో సీసీ రోడ్లు, కాలువ నిర్మాణ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఎంపీపీ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరి రాము, స్థానిక నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు నీతి కథలు



విద్యార్థులకు నీతి కథలు చెబుతున్న రచయిత్రి కొల్లా పుష్ప

శృంగవరపుకోట: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు శనివారం నీతికథలు చెప్పారు. పలు పాఠశాలల నుంచి హాజరైన విద్యార్థులకు రచయిత్రి కొల్లా పుష్ప నీతికథలు చెప్పి అందులో ఉన్న నీతిని వివరించారు. అనంతరం విద్యార్థులకు చదరంగంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి. శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ పట్టా అందుకున్న ‘కోరాడ’



పీహెచ్‌డీ పట్టా అందుకుంటున్న వేణు

చీపురుపల్లి: పట్టణంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన కోరాడ వేణు ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఈ మేరకు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.విజయ్‌మోహన్ నుంచి శనివారం పట్టా అందుకున్నారు. ‘ఇంపాక్ట్ ఆఫ్ డిఫరెంట్ ట్రైనింగ్ మెథడ్స్ అండ్ కాంబినేషన్ ఆఫ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఆన్ సెలెక్టెడ్ సైకాలజికల్ అండ్ ఫిజికల్ వేరియబుల్స్ ఆఫ్ వాలీబాల్ ప్లేయర్స్’ అనే అంశంపై రీసెర్చ్ చేసినట్లు వేణు తెలిపారు. వేణు ప్రస్తుతం అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

యోగాపై దృష్టి సారించండి

- ప్రముఖ యోగా గురువు శుభాకర్..



యోగాపై అవగాహన కల్పిస్తున్న యోగా గురువు శుభాకర్

గజపతినగరం: ప్రతిఒక్కరు యోగాపై దృష్టి సారించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ప్రముఖ యోగా గురువు శుభాకర్ (నంధ్యాల) తెలిపారు. శనివారం స్థానిక కల్కి భగవాన్ ధ్యాన మందిరంలో యోగా శిక్షకుడు శీరవాసు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం శీరవాసు 2500 రోజులుగా యోగాపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

నిగనిగంతా.. దగానే...!

- మామిడి కాయలను మగ్గించేందుకు విచ్చలవిడిగా రసాయనాల వినియోగం
- రంగే తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ముప్పు
- అన్నీ తెలిసినా అందరిలోనూ ఉదాసీనతే...
- రైఫినింగ్ చాంబర్ల ద్వారా మగ్గబెట్టే పండ్లే ఉత్తమం

కొత్తవలస:

పట్టణంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లు నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా ఎంతో అందగా కనిపిస్తున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, వగరుగా ఉంటున్నాయి. మామిడి కాయలు పక్వానికి రాకముందే కోసి రసాయనాల వినియోగంతో వాటిని పండ్లుగా మార్చేస్తున్నారు. మామిడి కాయలు పూర్తిగా పరువుకు వచ్చిన తర్వాతే సేంద్రియ పద్ధతిలో మగ్గపెడితే వాటి సువాసన వెదజిల్లడంతో పాటు అత్యంత మధురంగా, రుచిగా ఉంటాయి. రసాయనాలతో మగ్గించిన పండ్లు రుచిగా ఉండవు సరికదా.. ఆరోగ్యానికి కూడా హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్టప్రకారం నేరం కూడా. అయినా అటు వ్యాపారులు , ఇటు కొనుగోలుదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. నియంత్రించాల్సిన అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. రసాయనాలతో మగ్గించిన పండ్లను తినడం వల్ల జీర్ణక్రియ సమస్యలు, క్యాన్సర్ వంటి సమస్యలేర్పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది వ్యాపారులు తమ ఇళ్లల్లో ఒక కొట్టుగదిలో మామిడికాయలను ఉంచి కార్బైడ్ ద్వారా మగ్గిస్తున్నారు. అలాగే కొన్ని రకాల రసాయనాలను నీటిలో కలిపి మామిడి కాయలను ఆ నీటిలో ముంచి పక్కన పెడితే ఒక్క రోజులోనే నిగనిగలాడుతో మెరుస్తుంటాయి. ఈ ప్రక్రియ ద్వారా పండ్లను కృత్రిమంగా మగ్గించడం వల్ల మంచి రంగు రావడంతో కొనుగోలుదారులు ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. రసాయనాలతో పండ్లను మగ్గిస్తే కనీసం మూడు నెలల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమాన విధించే అవకాశం ఉంది.



రైఫినింగ్ చాంబర్‌లో మామిడి పండ్లను మగ్గిస్తున్న దృశ్యం

తగ్గిన మామిడి దిగుబడులు

జిల్లాలో 30,719 హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది. ఎకరాకి కనిష్ఠంగా ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మామిడి కాయలను స్థానికంగా విక్రయించడంతో పాటు కోల్‌కతా, ఢిల్లీ, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. కాగా ప్రస్తుత ఏడాది గణనీయంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. నాసిరకం కాయలను రసాయనాలతో మగ్గించి స్థానికంగా అమ్మకాలు చేస్తున్నారు.



కొత్తవలస మార్కెట్‌లో విక్రయిస్తున్న కృత్రిమంగా పండించిన మామిడి పండ్లు

రసాయనాలతో మగ్గించిన పండ్లు తినరాదు



రసాయనాలతో మగ్గించిన పండ్లు తింటే ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా జీర్ణకోశ వ్యాధి, ప్రేగులు దెబ్బతినే అవకాశం ,క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయి. పూర్తిగా పక్వానికి రాని ఏ రకమైన పండ్లను కూడా తినరాదు.

-సీతల్‌వర్మ, పీహెచ్‌సీ వైద్యురాలు, కొత్తవలస

రాయితీపై రైఫినింగ్ కేంద్రాలు



రైఫినింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే రైతులు, వ్యాపారులు సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ కేటగిరీ వ్యక్తులకు 50 శాతం రాయితీతో పథకం వర్తింపు జేస్తాం. పూర్తి వివరాలకు సచివాలయాల ఉద్యానవన సహాయకులను సంప్రదించాలి.

-పప్పు పద్మ, కొత్తవలస డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి

వ్యత్యాసం గుర్తించడం సులువే..

సహజంగా పండిన మామిడి పండ్లు, రసాయనాలతో మగ్గించిన పండ్లను గుర్తిండంలో ఒక సులువైన మార్గం ఉంది. సహజంగా పండిన మామిడి పండును నీటిలో వేస్తే అది మునిగిపోతుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు అయితే పండు పెద్దది అయినప్పటికీ, బరువు ఉన్నా నీటిలో వేస్తే తేలిపోతుంది. అలాగే సహజంగా పండిన పండు నుంచి సువాసన వస్తుంది. అదే రసాయనాలతో మగ్గించిన పండు నుంచి వాసన రాదు. సహజంగా పండిన పండు లోపలి భాగం బంగారు రంగులో ఉంటుంది. రసాయనాలతో మగ్గించిన పండు కోస్తే లోపలి భాగం లేత తెలుపురంగులో ఉంటుంది.

రైఫినింగ్ చాంబర్లు ఏర్పాటు చేయాలి..

మామిడి పండ్లను ఎటువంటి విషపూరిత రసాయనాలు వినియోగించకుండా మగ్గబెట్టేందుకు ప్రభుత్వం రైఫినింగ్ చాంబర్ల ఏర్పాటును ప్రోత్సహించాలి. ప్రస్తుతం ఈ చాంబర్ల నిర్వహణను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు.రైతులే కాకుండా వ్యాపారులు కూడా తమ పండ్లను ఈ చాంబర్లలో మగ్గించుకోవచ్చు. రైఫినింగ్ చాంబర్‌లో మొదటి రోజు ఏసీ ద్వారా శీతలీకరణ చేస్తారు. తర్వాత రోజు నుంచి మూడు రోజుల పాటు ఇథలిన్ గ్యాస్ పంపించి కాయలను మగ్గిస్తారు. కాయ పండులా మారడానికి నాలుగు రోజుల సమయం పడుతుంది. రైఫినింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసుకునేవారికి 40 నుంచి 50 శాతం వరకు ఉద్యానవన శాఖ రాయితీ అందిస్తోంది.

పరామర్శ



రౌతు కుమార్‌నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

మెరకముడిదాం: ఇప్పలవలస మాజీ సర్పంచ్, చీపురుపల్లి ఆర్‌ఈసీఎస్ మాజీ డైరెక్టర్ రౌతుకుమార్‌నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం ఇప్పలవలస గ్రామానికి చేరుకుని రౌతు కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుమార్‌నాయుడు మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్‌వీ రమణరాజు, కోట్ల విశ్వేశ్వరరావు, చీపురుపల్లి మండల నాయకుడు వలిరెడ్డి శ్రీనివాస నాయుడు, సర్పంచ్‌లు బెహరా రమేష్, పెనుమజ్జి అప్పలనారాయణ, సారిక తమ్మినాయుడు, రౌతు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటరమణ, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మజ్జి శ్రీనివాసరావు, తదితరులు

వైస్ ఎంపీపీ కుటుంబాన్ని..

శృంగవరపుకోట: మండల వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ మాతృమూర్తి పినిశెట్టి అచ్చియ్యమ్మ పెద్ద కర్మలో జిల్లా పరిషత్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చియ్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శలో వైఎస్సార్‌సీపీ నాయకులు వాకాడ రాంబాబు, ఎం.కుమార్, బాబు, బంగారునాయుడు, కొత్తూరు సర్పంచ్ సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో నవధాన్యాల కిట్లు



నవధాన్యాలు విత్తనాలు చూపిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

వేపాడ: మండలంలోని పలు రైతుసేవా కేంద్రాల్లో నవధాన్యాల కిట్లు అందుబాటులో ఉన్నాయని మాస్టర్ ట్రైనర్ ఈశ్వరరావు తెలిపారు. మండలంలోని వేపాడ, బొద్దాం, తదితర గ్రామాల్లో శనివారం అవగాహన సదస్సులు నిర్వహించి, నవధాన్యాల సాగు వల్ల కలిగే లాభాలను రైతులకు వివరించారు. వరి సాగుకు ముందు 12 కిలోల నవధాన్యాలను ఒక ఎకరా పొలంలో వేసి.. వరి నాట్లు వేసే ముందు బాగా కలియదున్నితే భూమి సారవంతమవుతుందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయం బొద్దాం యూనిట్ ఇన్‌చార్జి రామలక్ష్మి పొలంలో ప్రయోగపూర్వకంగా 35 రకాల విత్తనాలు 24 కిలోలు చల్లినట్లు చెప్పారు. అనంతరం ఆకులసీతంపేట, వీలుపర్తి, కరకవలస, పాటూరు, కేజీపూడి, కుమ్మపల్లి యూనిట్లలో తయారుచేసిన పీఎండీఎస్ కిట్లను పరిశీలించారు.

14 ఏళ్ల తర్వాత పండగొచ్చింది..

శృంగవరపుకోట: మేజర్ పంచాయతీ శృంగవరపుకోట పరిధిలో ఉన్న శివారు గ్రామం సీతంపేటకు 14 ఏళ్ల తర్వాత పండగొచ్చింది. గ్రామదేవత బందమ్మ తల్లి పండగ నిర్వహించేందుకు గ్రామపెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా శనివారం గ్రామంలో పండగ చాటింపు వేయించారు. ఈ సందర్భంగా ఈనెల 31న తొలేళ్ల ఉత్సవం, జూన్ 1న అనుపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామంలో చాటింపు వేశారు. గ్రామ శివారులో ఉన్న బండమ్మతల్లికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోకి ఆహ్వానించినట్లు పెద్దలు, పూజారులు తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు యలమంచిలి ఈశ్వరరావు, చిప్పాడ రమణ, చింతల నారాయణమూర్తి, నాగరాజు, అప్పలసత్యం, వెలుచూరి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



బండమ్మతల్లి పండగ చాటింపు వేస్తున్న దృశ్యం

ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు సరికాదు

బొండపల్లి: ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే ఎండీయూ ఆపరేటర్లను తొలగించడం సరికాదని.. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా నాయకుడు పురం అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. 2019 సంవత్సరం నుంచి విధులు నిర్వర్తిస్తున్న వారిని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. 2027 సంవత్సరం వరకు వారిని కొనసాగిస్తామని అగ్రిమెంట్ చేసుకున్న ప్రభుత్వం ఇప్పుడు ఎలా తొలగిస్తుందన్నారు. అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పుడు ఉన్నవారిని ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు.

మాస్కులు ధరించండి

బొండపల్లి: రద్దీ ప్రదేశాల్లో తిరిగే వారితో పాటు వాహనాల్లో ప్రయాణించే వారు తప్పనిసరిగా మాస్కులు ధరించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎల్.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. కోవిడ్ లక్షణాలు కనిపిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ముప్పు తప్పదని పేర్కొన్నారు.

పశువుల వ్యాన్ సీజ్

దత్తిరాజేరు: ఎలాంటి అనుమతుల్లేకుండా పెదమానాపురం నుంచి విజయనగరం వైపు ఐదు పశువులను తరలిస్తున్న బొలేరా వ్యాన్‌ను పట్టుకొని సీజ్ చేసినట్లు పెదమానాపురం ఎస్సై జయంతి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాన్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమంగా పశువులను తరలిస్తే చర్యలు తప్పవన్నారు.

బకాయి వసూళ్లు వేగవంతం

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీలలో నీటితీరువా బకాయి వసూళ్లు వేగవంతం చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించినట్లు తహసీల్దార్ విజయ్‌భాస్కర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాలుగా రైతుల నుంచి 63 లక్షల రూపాయలు రావాల్సి ఉందన్నారు. నీటితీరువా బకాయిలను వసూళ్ల పర్యవేక్షణకు ముగ్గురు సభ్యులను నియమించినట్లు తెలిపారు.

నీతిపద్యాలపై అవగాహన

డెంకాడ: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతిపద్యాలపై శనివారం అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ వై.మహేష్.. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు నీతిపద్యాలు–వాటి భావం తెలిపారు. నీతిపద్యాలే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిస్తాయని, ప్రతిఒక్కరూ నీతి పద్యాలు చదివి అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

ప్రారంభానికి సిద్ధం..



గజపతినగరం మండల కేంద్రంలో వంద పడలక ఆస్పత్రి భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పనులు దాదాపు పూర్తయ్యాయి. వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య కృషితో 30 పడకల ఆస్పత్రిని వంద పడకల స్థాయికి అప్‌గ్రేడ్ చేశారు. ఆస్పత్రి అందుబాటులోకి వస్తే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుతాయి. – గజపతినగరం

ప్రహరీ నిర్మించరూ..!



ప్రహరీ లేని కేజీబీవీ జూనియర్ కళాశాల

చీపురుపల్లి: పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల జూనియర్ కళాశాలకు ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పట్టణానికి దూరంగా మెట్టకాలనీ ప్రాంతంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఉండేది. అక్కడ పదో తరగతి వరకు తరగతులు నిర్వహించగా.. కొంత కాలం కిందట జూనియర్ కళాశాల కూడా మంజూరైంది. దీంతో గత ప్రభుత్వ హయాంలో కేజీబీవీ పాఠశాలకు సమీపంలోనే రూ.1.10 కోట్ల సర్వశిక్షా భియాన్ నిధులతో జూనియర్ కళాశాల భవనాలు నిర్మించారు. దీంతో అప్పటివరకు ఉన్న తరగతి గదుల సమస్య తొలగిపోయింది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆ కళాశాలకు కనీసం ప్రహరీ అయినా నిర్మిస్తుందని ఆశ పడిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. ప్రహరీ లేకపోవడంతో పశువులు పాఠశాల ఆవరణలో సంచరిస్తున్నాయని.. అధికారులు, పాలకులు స్పందించి ప్రహరీ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

సారాతో పట్టుబడితే చర్యలు



గీత కార్మికులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తవలస: గీత కార్మికులు సారాతో పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటిండెంట్ ఏఎస్ దొర అన్నారు. మండలంలోని రామలింగాపురం, ముసిరాం గ్రామాల్లో నవోదయం–2 కార్యక్రమంలో భాగంగా సారా తయారీ, తాగడం, విక్రయిస్తూ పట్టుబడితే తీసుకునే చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గీత కార్మికులు సారా జోలికి పోవద్దని సూచించారు. సారాతో పట్టుబడితే శిక్షతో పాటు గీత కార్మిక కార్డును రద్దు చేస్తామన్నారు. అలాగే సారా తయారీకి అవసరమైన బెల్లం సరఫరా చేసే వ్యక్తులపై కూడా నిఘా పెట్టినట్లు చెప్పారు. అనంతం సారా జోలికి వెళ్లమని గీత కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రాజశేఖరనాయుడు, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు గౌరవం ఇవ్వాల్సిందే..

- ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు

లక్కవరపుకోట: స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులైన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లను అభివృద్ధి పనుల్లో భాగస్వాములను చేసి వారికి తగిన గౌరవం ఇవ్వాల్సిందేనని ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ భవనంలో ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన ఎంపీడీఓ ఎస్.అప్పారావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలపై వివరించారు. చందులూరు గ్రామంలో సర్పంచ్ ఆమోదం లేకుండా ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అధికారులు సీసీ రోడ్డు వేయడంపై ఎంపీటీసీ సభ్యుడు యడ్ల కిశోర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఏదైనా అభివృద్ధి పనులు చేపట్టాలంటే తప్పకుండా గ్రామసభ ఆమోదం కలిగి ఉండాలని తెలిపారు. అలాగే వేచలపువానిపాలెంలో నిబంధనలకు వ్యవసాయ బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధికారులను నిలదీశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కనీసం గౌరవం ఇవ్వడం లేదన్నారు. గ్రామసభల ఆమోదం లేకుండా పనులు చేపట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముదునూరు శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సభ్యులు, అధికారులు

ఉపాధి పని కల్పించండి



ఉపాధి పని కల్పించాలంటూ కోరుతున్న శింగరాయి వేతనదారులు

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామానికి చెందిన పలువురు ఎస్సీ వేతనదారులు తమకు ఉపాధి పని కల్పించాలని కోరుతున్నారు. ఈ మేరకు పలువురు వేతనదారులు శనివారం మాట్లాడుతూ...ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న క్షేత్ర సహాయకుడు తప్పుడు మస్టర్లతో వేతనదారులను మోసం చేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏపీఓ ఆదిలక్ష్మి విచారణ చేపట్టారని తెలిపారు. అయితే వేతనదారులకు పని కల్పించకపోవడంపై ఏపీఓ ఆదిలక్ష్మి స్పందిస్తూ గురువారం నుంచి టీసీఏ న్‌ఎం ఆధ్వర్యంలో పనులు కల్పిస్తామన్నారు.